క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ బ్రోచర్ల ఆవిష్కరణ

భట్టిప్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ కోసం ఎన్నో నూతన పథకాలను ప్రవేశ పెడుతూ ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ఆవిష్కరించి పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఇకపై అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రూ. 25 లక్షల పరిమితితో కూడిన నూతన ఆరోగ్యశ్రీ కార్డులను వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయాల ద్వారా అందచేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఆరోగ్యశ్రీ రీజినల్ కో–ఆర్డినేటర్ కె. కిషోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

షాదీఖానా పనుల పరిశీలన



అద్దేపల్లి(భట్టిప్రోలు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు ఆదేశించారు. గురువారం భట్టిప్రోలు–1, 2 సచివాలయాలకు కేటాయించిన రూ.40 లక్షల నిధుల్లో అద్దేపల్లిలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న షాదీఖానా పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయన వెంట కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాగర్ ఉన్నారు.

ఎంపీ ఆర్థిక సాయం అందజేత



నిజాంపట్నం: మండలంలోని గరువుపాలేనికి చెందిన గాదె రామ్మోహనరావు గురుస్వామి భార్య ఇటీవల ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు గురువారం ఆయన సోదరుడు మోపిదేవి హరనాథ బాబు ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఆకుటుంబానికి అందజేశారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

19న వృక్షశాస్త్ర విభాగ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల విశ్రాంత వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్. రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 19న వృక్షశాస్త్రంలో అంతర్ కళాశాలల క్విజ్, వక్తృత్వ, డిజిటల్ పోస్టర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పోటీలకు హాజరు కావచ్చునని, విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 16లోపు తమ పేర్లను వాట్సాప్ ద్వారా నమోదు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 94407 12410 నంబర్లో కన్వీనర్ డాక్టర్ జి. రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

17న గుంటూరు జిల్లా చరిత్ర సంఘ వార్షికోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా చరిత్ర సంఘ 29వ వార్షికోత్సవ సభను ఆదివారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఎస్. శామ్యూల్, డాక్టర్ మంచాల బోసుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళ మెత్తుదామా' పుస్తకావిష్కరణతో పాటు మంతెన వెంకటరాజు స్మారకోపన్యాసం, విద్యావ్యవస్థలో చరిత్ర–మార్పులు, వ్యాఖ్యానాలు, భారత రాజ్యాంగం–లౌకికవాదంపై చర్చా కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఇంటా వెల్లివిరిసిన సంక్షేమం

ఎమ్మెల్యే కోన రఘుపతి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

చింతాయపాలెం(కర్లపాలెం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరిసిందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. గురువారం చింతాయపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డును ఆవిష్కరించారు. పేద బడుగు బలహీన వర్గాల వారితో పాటు ప్రతి కుటుంబానికి ఒక సంక్షేమ పథకం వచ్చే విధంగా పథకాలు మంజూరు చేసిన వైఎస్ జగన్‌ను మనం మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసుకునేందుకు, మెడికల్ కళాశాల, వైద్యశాలను ప్రారంభించుకునేందుకు తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, నాయకులు రాతంశెట్టి లక్ష్మణరావు, కాగిత బుల్లియ్య, ఆసిఫ్ అలీ, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, మందపాటి పరమానంద కుమార్, తోట వెంకటరమణ, సుభాష్ చంద్రబోస్, కాగిత మహేష్, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

లోక రక్షకుడికి స్వాగతం పలుకుతూ..



ఏఈఎల్‌సీ చర్చి వద్ద



ఆళ్లమూడిలో క్రిస్మస్ స్టార్ ఏర్పాటు

రేపల్లె రూరల్: క్రిస్మస్ నెలను పురస్కరించుకుని పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. క్రైస్తవులు ప్రధాన రహదారుల వెంబడి, గృహాల ఎదుట నక్షత్రాలను నెలకొల్పారు. అవనిపై క్రీస్తు ఆగమనాన్ని స్వాగతం పలికేలా నెలకొల్పిన రంగు రంగుల నక్షత్రాలు కాంతులు వెదజల్లుతున్నాయి. పట్టణంలోని ఐఆర్ఈఎఫ్, ఏఈఎల్‌సీ చర్చిల ఎదుట, ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్‌లు ఆకట్టుకుంటున్నాయి.

భట్టిప్రోలు: ఈ నెల 25న క్రిస్మస్ పండగ సందర్భంగా ఆళ్లమూడిలోని యువకులు క్రిస్మస్ స్టార్‌ను తీర్చిదిద్దారు. పాస్టర్ ఆదాం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్ని చర్చిలలో 30 రోజుల క్రిస్మస్ ఆరాధనలు జరుగుతున్నాయి.

రేపు ఇన్‌చార్జిగా వరికూటి బాధ్యతలు



వేమూరు: నియోజక వర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాధ్యతలు వరికూటి అశోక్‌బాబు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మార్కెట్ యార్డులో చేపట్టనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న నియోజకవర్గం ఇన్‌చార్జిగా వరి కూటి అశోక్ బాబును ఆ పార్టీ ప్రకటించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. మంత్రి మేరుగ నాగార్జునను బాపట్ల జిల్లాలోని సంతనూతలపాడు నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా నియమించడం జరిగింది. నియోజక వర్గంలోని వేమూరు, కొల్లూరు,భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ



ఐలవరంలో అయ్యప్ప స్వామి పంచముఖ మండపం



పాతనందాయపాలెం పడిపూజలో పోటెత్తిన అయ్యప్పలు, భవానీలు

పాతనందాయపాలెం(కర్లపాలెం): పాతనందాయపాలెం గ్రామంలో 216 జాతీయ రహదారి పక్కన 9అడుగుల ఎత్తు వేదిక ఏర్పాటు చేసి 40అడుగుల ఎత్తులో మహా మండపం నిర్మించి అయ్యప్పస్వామి మహాపడి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడు, శివపార్వతులు, రాధాకృష్ణులు, కనకదుర్గమ్మ, వెంకటేశ్వర స్వామి, అయ్యప్పస్వామి భారీ ఎత్తున ఉన్న అర్ధనారీశ్వరస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. వేదికకు 18మెట్లు ఏర్పాటు చేసి, పలు రకాల పూలతో అలంకరణ చేశారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలకు మధురై శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పలు అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వాములు 1500 మంది, భక్తులు 4వేల మంది పాల్గొన్నారు. 5,500ల మందికి ప్రసాదాలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అయ్యప్ప శరణఘోష

ఐలవరం(భట్టిప్రోలు): స్వామియే శరణమయ్యప్ప నామ స్మరణతో బుధవారం రాత్రి ఐలవరం గ్రామం మారుమోగింది. స్థానిక పంచముఖ మండపాల వద్ద అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగా జరిగింది. గురు స్వాములు కాటూరు సుబ్రహ్మణ్యం, డోకుపర్తి రఘు ఆధ్వర్యంలో స్వామికి 18 రకాల అభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపారు. హోమ గుండంలో దీక్షా దారులు నడిచారు. అయ్యప్ప, శివ స్వాములు, భవానీలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురుస్వామి ఆకురాతి సుబ్బారావు, స్వాములు రాచాబత్తుని జగదీష్, గోలి శ్రీనివాసరావు, కొడాలి వెంకటేష్ పర్యవేక్షించారు. గురువారం స్థానిక శివాలయంలో ఇరుముడుల కార్యక్రమం జరిగింది.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

ఎమ్మెల్యే కోన రఘుపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: క్రీస్తు బోధనలు ఆచరణీయమైనవని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. హోప్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం ఇందిరానగర్‌లో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, మాట్లాడారు. నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించుము అని ప్రభువు చెప్పాడని తెలిపారు. అందరూ సంతోషంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. హోప్ పాస్టర్స్ ఫెలోషిప్ భవనం నిర్మించుకునేందుకు స్థలం మంజూరు చేయిస్తున్నామని కోన తెలిపారు. అనంతరం పాస్టర్లు కోన రఘుపతికి చిరు సన్మానం చేసి, మెమెంటో అందజేశారు. దైవ జనులు, సంఘ సేవకులు మోపర్తి జాన్ దైవ వర్తమానం అందించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు రమేష్, ఐక్య క్రిస్మస్ సభాధ్యక్షుడు లాభానురాజు, పాస్టర్లు చంటిబాబు, అబ్రహాం, గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఆట్ల నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహిళల కబడ్డీ జట్టుకు తృతీయ స్థానం



క్రీడాకారిణులుతో సొసైటీ సభ్యులు

బాపట్ల అర్బన్: మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు 8 మంది నవంబరు 24న బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 1 వరకు కర్నూలులోని ఎమ్మిగనూరు పట్టణంలో అంతర్ జిల్లాల పోటీల్లో తృతీయ స్థానం సాధించారు. గురువారం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులను అభినందించి, సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జి.దిలీప్ కుమార్, జాయింట్ సెక్రెటరీ కె. హరిప్రసాద్, ట్రెజరర్. టి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్, రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

భట్టిప్రోలు: ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి ఈ నెల 17వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు పొడగించినట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడల నిర్వహణకు కిట్లను పంపిణీ చేశారు. సచివాలయాల ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి క్రీడలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలి



నూతన వస్త్రాలను అందజేస్తున్న గిరిబాబు

భట్టిప్రోలు: ప్రపంచమంతా చేసుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని ప్రత్యక్షత మినిస్ట్రీస్ అధినేత ఎస్. గిరి బాబు పేర్కొన్నారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక దళితవాడ చర్చిలో సెమీ క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు, పాస్టర్ వి. ఆనందరావు, సెక్రటరీ పాస్టర్ జయరావు అధ్యక్షత వహించారు. సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవదేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. క్రిస్మస్ కానుకగా గిరిబాబు మండలంలోని 80 మంది దైవ సేవకులకు నూతన వస్త్రాలు అందించారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. పాస్టర్లు గోపి, సైమన్ పీటర్, వినోద్ సందేశం అందజేశారు. స్థానిక రైలుపేట ఎస్టీ కాలనీలో గురువారం వీఆర్వో సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి మహిళలకు నూతన వస్త్రాలు, చిన్నారులకు కేక్‌లు, చాక్లెట్లు, మిఠాయిలు అందించారు. సంస్థ యానిమేటర్ పుష్పలత, టీచర్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది



వరిపైరును పరిశీలిస్తున్న రేపల్లె ఆర్డీఓ హెలాషారోన్

నగరం: తుపాను కారణంగా పంట దెబ్బతిన్న ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని రేపల్లె ఆర్డీవో బీఎస్ హేలా షారోన్ తెలిపారు. నగరం గ్రామంలోని తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఇప్పటికే గ్రామాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించి, జాబితాను తయారుచేయాలని అధికారులను ఆదేశించామన్నారు.వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.ప్రమీల, మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఎఈవో నాగ శ్రీనివాసరావు తదితరులున్నారు.

అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

సుమారు రూ.5లక్షల ఆస్తినష్టం



దగ్ధమవుతున్న పూరిళ్లు

నగరం: అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమై సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన మీసాలవారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మీసాలవారిపాలెం ఎస్టీ కాలనీలో గురువారం మూడు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎస్టీ కాలనీలోని కొమరగిరి దుర్గ ఇంటి నుంచి మంటలు చెలరేగి పక్కనే ఉన్న కోనేటి నాగలక్ష్మి, కోనేటి సత్యవతి పూరిళ్లకు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు మంటలను ఆదుపుచేశారు. అయితే అప్పటికే మూడు పూరిళ్లు, సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సర్పంచ్ చింతల సుబ్బారావు, వీఆర్వో సుధాకర్ వచ్చి బాధితులను పరామర్శించి, అండగా ఉంటామని హామీనిచ్చారు.

మహా సభను విజయవంతం చేయాలి

బాపట్ల: మాదిగ సమన్వయ మహా సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బలసాని రామకృష్ణ కోరారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాదిగ ఉప కులాల సమన్వయంతో ఈ మహాసభలను నిర్వహిస్తునట్లు తెలిపారు. మహా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెళ్ల అరుణ్ క్రాంతి, గద్దె షాలెం రాజు, గుడిపాటి శ్రీనివాసరావు, పర్సిపోగు వంశీ, బొడిపోగు కొండయ్య, బెజవాడ సన్ని, చాట్ల రెంసన్ రాజ్, జోగి రాజారావు, గంగావరపు బెస్తి పాల్గొన్నారు.

గర్భిణులు ముహూర్తాల కోసం వేచి ఉండటం ప్రమాదం



గుంటూరు మెడికల్: గర్భిణులు నొప్పులు భరించలేకపోవడం, ముహూర్తల పేరుతో శస్త్ర చికిత్సల కోసం తాపత్రయం పడుతుండటం బాధాకరమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రి శుశ్రుత హాలులో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు, బరువు తక్కువ పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాగరికత పెరుగుతున్న సమాజంలో ముహూర్తం పెట్టుకుని పిల్లలకు జన్మనిచ్చేందుకు తల్లులు సిద్ధపడుతుండటం విచారకరమన్నారు. దానివల్ల అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రకృతి పరంగా శిశువు జన్మనిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. సాధారణ శస్త్ర చికిత్సల వల్ల శిశువులు ఆరోగ్యంగా పుడతారని, ఈ విషయాన్నీ తల్లిదండ్రులు గమనించాలని ఆయన సూచించారు. నెలలు నిండకుండా శిశువులు జన్మనిస్తే ఆరోగ్యవంతంగా ఉండటం కష్టమని చెప్పారు. వ్యాధులు, వైకల్యంతో బాధపడతారని వెల్లడించారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం చిన్నారులకు వైద్య సేవలు సత్వరంగా అందించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు మాట్లాడుతూ నెలలు నిండిన గర్భిణులు ప్రసవం తర్వాత శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని పాల్గొన్నారు.

పోయిన బ్యాగ్‌ను మహిళకు అప్పగించిన పోలీసులు



పట్నంబజారు: బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు ట్రాఫిక్ పోలీసులు తిరిగి అప్పజెప్పిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఈస్ట్ ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... వింజనంపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం గుంటూరు మార్కెట్‌కు వచ్చింది. ముందుగా బ్యాంకుకు వెళ్లి బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి రూ. 2 లక్షల నగదు, కొంత బంగారంతో మార్కెట్‌కు వచ్చి పనులు చూసుకుని ఆటోలో వెళుతుండగా చేతి బ్యాగ్ తెగి కింద పడిపోయింది. గమనించిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు విషయాన్ని ఎస్ఐ షరీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో మహిళ ఆచూకీ గుర్తించిన పోలీసులు ఆ బ్యాగును తిరిగి ఆమెకు అందజేశారు.

నేటి నుంచి అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం

పాత గుంటూరు: ఏలూరు బజారు శ్రీ కోదండ రామ మందిరం వద్ద శ్రీ వాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో 15 నుంచి 17 వరకు సహస్ర కలశ అభిషేకాలు, అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ నాళం శివప్రసాద్ తెలిపారు. వేదిక ప్రాంగణంలో గురువారం ఉత్సవ ఆహ్వాన పత్రిక కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో శివప్రసాద్ మాట్లాడుతూ 15న ఉదయం 8:10 నిమిషాలకు అష్ట ద్రవ్య మహాగణపతి హోమం, సాయంత్రం సహస్ర కలశ పూజ, ప్రధాన ఉదయం సహస్ర కలశ అభిషేకాలు, 18 రకాల ద్రవ్యాలు, నదీ జలాలతో స్వామికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు 18 రకాల పూలతో అభిషేకాలు, శ్రీ అయ్యప్ప స్వామి అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం ఉంటాయని తెలిపారు. అనంతరం అయ్యప్ప, భవానీలు, భక్తులకు భిక్ష ఉంటుందని చెప్పారు. 17న అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నామని, భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో డి.వి. రవి కుమార్, జుజ్జూరు శ్రీనివాసరావు, దేవతి శివకుమార్, పాదర్తి ఉమామహేశ్వరరావు, ఓం ప్రకాష్, జి. నాగ వెంకట నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామనామక్షేత్రం సమీపంలో గురువారం ఉదయం భాస్కరరావు, వెంకటశివనాగరాజు 400 కిలోల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా, సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.